పశుగ్రాసం.. పరేషాన్

- వరికోతల్లో పెరిగిన యంత్రాల వినియోగం
- గడ్డి ముక్కలవడంతో నిల్వచేసేందుకు ఇబ్బంది
- గడ్డి దొరక్క పాడిరైతుల అవస్థలు



ఆర్వేస్టర్ ద్వారా ముక్కలవుతున్న వరిగడ్డి



యంత్రాలు కోయడంతో ముక్కలైన గడ్డి

మద్దూరు: వరికోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాక పశువులకు గడ్డి దొరకని పరిస్థితి నెలకొంది. మండలంలోని యాసంగిలో వరిసాగు విస్తీర్ణం పెరిగిన వరిగడ్డి దొరకడం లేదు. కోతలకు యంత్రాలు ఉపయోగించడమే గడ్డి ముక్కలుగా రావడంతో కట్టలు కట్టడానికి వీలుగా లేక రైతులు నిల్వ చేయలేకపోతున్నారు. కూలీల కొరతతో వరికోతలకు యంత్రాల వినియోగం కూడా పెరిగిపోయింది. బోరుమోటార్ల కింద వరిని సాగుచేసిన రైతులు యంత్రాలతో వరికోతలు చేపట్టడంతో నష్టం తగ్గి పంట పూర్తిస్థాయిలో చేతికందుతుందని రైతులు భావిస్తున్నారు. కానీ పశువులకు మాత్రం గడ్డి దొరకడం లేదు. కూలీలతో వరికోతలు చేపడితే గడ్డి ఇబ్బడి ముబ్బడిగా ఉండేది. నిల్వ చేసుకునేందుకు కూడా అనుకూలంగా ఉంటుంది. పశుగ్రాసం కొరతతో తప్పని పరిస్థితుల్లో ఆ గడ్డిని రైతులు నిల్వ ఉంచుకునేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో నీటి వనరులు లేని ఆయకట్టేతర రైతులు గ్రాసం కోసం అవస్థలు పడుతున్నారు.

ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే..

యంత్రాలతో కోసిన తర్వాత కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఏడాదిపాటు గడ్డి నిల్వ ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పొలంలో ఉన్న గడ్డిని వనలుగా సేకరించి ఒక్కో వనను గట్టిగా కట్టాలి. అనంతరం ఆ వనలను ఒక ప్రాంతానికి చేర్చి గడ్డిమేటు వేయాలని చెబుతున్నారు. గడ్డి మేటు వేసే సమయంలో పై కప్పు ఏటవాలుగా ఉండేలా చేసుకొని, పైన టార్పాలిన్ లేదా ప్లాస్టిక్ కవర్లు వంటివి కప్పడంతో వర్షాకాలం నీరు వెళ్లకుండా ఉండడంతోపాటు ఎక్కువ రోజులు గడ్డి నిల్వ ఉంటుందని సూచిస్తున్నారు.

గడ్డి దొరకడం లేదు..



యంత్రాలతో వరికోతలు చేపట్టడంతో పశువులకు గడ్డి దొరకడం కష్టంగా మారింది. గతంలో కూలీలతో వరికోతలు చేపట్టడంతో గడ్డి ఇబ్బడి ముబ్బడిగా లభించేది. కూలీలతో కోతకోసిన పొలాల నుంచి గడ్డి పూర్తిగా రావడంతో నిల్వచేసేందుకు వీలుగా ఉండేది. యంత్రాలతో కోసిన వరిగడ్డి చిన్న చిన్ని ముక్కలుగా రావడం, నలిగిపోతుండటంతో నిల్వకు పనికిరాకుండా పోతుంది.

– అంజయ్యగౌడ్, పాడిరైతు, కొమ్మూరు

కిషన్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాదు



మాట్లాడుతున్న నాగురావు నామాజీ

నారాయణపేట: పదవుల కోసం పూటకో గొడుగు పట్టే సీఎం రేవంత్ క్రమ శిక్షణతో ప్రజా నాయకుడిగా ఎదిగిన బీజేపీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని బీజేపీ నాయకులు నాగురావు నామాజీ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాసులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. రాష్ట్ర ఏర్పాటుకోసం కిషన్‌రెడ్డి నిబద్ధతతో అనేక ఉద్యమాలు చేశారని, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసి నాడు సోనియాగాంధీని రాక్షసి అని నేడు పదవి ఇవ్వగానే దేవత అయిందా అని సీఎంను ప్రశ్నించారు. కిషన్‌రెడ్డిని కానీ బీజేపీ కార్యకర్తను విమర్శించే స్థాయి లేదన్నారు. కేవలం పదవిని కాపాడుకోవడం కోసం సోనియాకు, రాహుల్ గాంధీకి రాష్ట్రం నుంచి డబ్బులు పంపడం ఒక్కటే పని అని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయకుండా ఉత్సవాలు జరుపుకోవడం దుర్మార్గమన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మరికల్: మండల కేంద్రంలోని 132/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వెంకట్‌నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో చేసే మరమ్మతులకు ఉదయం 7–30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు వినియోగాదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

కోస్గి రూరల్: గుండుమాల్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భానోదయ ఒక ప్రకటనలో తెలిపారు. అప్పాయిపల్లిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని తెలిపారు.

బస్సులు సమయానికి నడపాలి

నారాయణపేట: ఆర్టీసీ బస్సులను సరైన సమయంలో నడపాలని కోరుతూ బుధవారం ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డీఎం లావణ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. నారాయణపేట, మక్తల్, మరికల్, మద్దూర్, కోస్గి, యానగుంది, కోటకొండ రూట్లలో ఉదయం, సాయంత్రం వేళలో పాఠశాలల సమయాన్ని దృష్టిలో పెట్టుకొని బస్సులను నడిపించాలని కోరారు. ఇందుకు డీఎం సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ సంఘం అధ్యక్షులు యశ్వంత్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్, సభ్యులు మోహన్‌రావు తదితరులు ఉన్నారు.



డీఎంకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొత్తపల్లి: కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీకి చెందిన 44మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యమకారుల నియోజకవర్గ కన్వీనర్‌గా ఆశిరెడ్డి

నారాయణపేట టౌన్: పట్టణంలోని స్థానిక సిటిజన్ క్లబ్‌లో బుధవారం తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీశైలం సమక్షంలో నియోజకవర్గ కన్వీనర్‌గా ఆశిరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా 14 ఏళ్ల పాటు ఉద్యమాలు చేస్తేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. సంఘం అధ్యక్షులు జావిద్, ఉద్యమకారులు స్టాంప్ రాంరెడ్డి, వెంకటరాములు, సాయిలు, గంజాయి సతీష్, మడివాల కృష్ణ, మోహన్ రజక్, రాము పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

అమరచింత: గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎన్నో విధాలుగా ఉపయోగపడుతాయని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండలంలోని మస్తీపురంలో బుధవారం సీసీ కెమెరాల ఏర్పాటు గురించి ప్రజలతో పాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులతో కలిసి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలు గ్రామంలోని నలు మూలల ఉంటే రాత్రి వేళలో అపరచిత వ్యక్తుల వల్ల కలిగే అనర్థాలను గుర్తించడమే కాకుండా చోరీలు, నేరాలను నియంత్రించే అవకాశం ఉందన్నారు. గ్రామ ప్రజలు సమిష్టిగా కలిసి వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తర్వాత వాటిని పోలీస్ స్టేషన్ నుంచే మానిటరింగ్ చేస్తూ నేరాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందన్నారు. కురుమన్న, మల్లారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు.. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు సీహెచ్‌ఎం తేజస్విని ఆధ్వర్యంలో టిటానాస్ డిప్తీరియా వ్యాక్సినేషన్ ఇచ్చారు. ఈ వ్యాక్సినేషన్ విద్యార్థులకు రోగ నిరోధక శక్తిని పెంచడానికి, సీజనల్ వ్యాధులను అరికట్టడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. హెచ్‌ఎం తిమ్మన్న, ఉపాధ్యాయులు నిహారిక, సోని, ఏఎస్‌ఎం లక్ష్మిదేవి, ఆశావర్కర్లు సత్యమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

బిల్లులు రాకపోవడంతో పాఠశాలకు తాళం

మక్తల్: ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణం పూర్తిచేసిన నేటికి బిల్లులు రాకపోవడంతో మేస్త్రీ పాఠశాలకు తాళం వేసిన సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. మున్సిపాలిటీ పరిధిలోని చందపూర్ పాఠశాల భవన నిర్మాణానికి రూ. 43లక్షలు మంజూరైంది. భవన నిర్మాణ పనులు చేస్తుండగా కాంట్రాక్టర్ మధ్యలో మృతి చెందారు. అయితే గ్రామస్తులు మేస్త్రీని నమ్మి పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు ఆదేశించారు. పనులు చేసిన నేటివరకు బిల్లులు రాకపోవడంతో మేస్త్రీ పాఠశాలకు తాళం వేశారు. దీంతో విద్యార్థులు వరండాలో కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలో 150మంది విద్యార్థులు, ఎనిమిది మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ సంఘటనపై ఎంఈఓ అనిల్‌గౌడ్‌ను వివరణ కోరగా ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

కరపత్రాల విడుదల

మాగనూర్: వచ్చేనెల 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి నర్సింహులు అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో వారు సింహగర్జన కార్యక్రమం కరపత్రాన్ని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. మన హక్కుల పరిరక్షణ కోసం భాగస్వాములం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, సగరం మధు, రమేష్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

గిట్టుబాటు ధర కల్పించాలి

మక్తల్: పత్తి పండిన రైతులకు స్వామినాథ్ సిపార్సు ప్రకారం గిట్టుబాటు ధర కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం అధ్యక్షుడు భగవంతు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని గుడిగండ్ల కాటన్ మిల్‌ను పరిశీలించారు. పత్తి అమ్ముకోవడానికి వచ్చిన రైతులతో సమస్యను అడిగి తెలుసుకున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రం అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకటేష్, అంజప్ప, ఎండీ సలీం, నర్సింహులు పాల్గొన్నారు.



విద్యార్థులు దేశం గర్వించేస్థాయికి ఎదగాలి

ఆత్మకూర్: విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని, బాలలకు ప్రాథమికంగా స్వేచ్ఛ, విద్య, జీవించడం, రక్షణ, అభివృద్ధి హక్కులు ఉంటాయని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. బుధవారం బాలకిష్టాపూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ హక్కులను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. బాలల హక్కులకు భంగం కలిగించినా, బాల కార్మికులను పనిలో పెట్టుకున్న, బాల్యవివాహాలు చేసిన, వేధింపులకు గురిచేసిన 100, 1098 కాల్‌సెంటర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తోటివిద్యార్థులను ర్యాగింగ్ పేరిట అవమానాలకు గురిచేసిన, దాడులకు పాల్పడ్డ, ఆత్మహత్యలకు ప్రేరేపించిన, నిర్బంధాలకు గురిచేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఇంటర్‌నెట్ వినియోగం పెరిగిన తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లారూరల్ డెవలప్‌మెంట్ సభ్యులు హరికృష్ణ, ఆర్డీఎస్ ఇన్‌చార్జ్‌లు రామకృష్ణ, రజనీకాంత్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సునీత, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం



మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ: రాష్ట్రంలో మహిళా సాధికారతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం నర్వ మండల పరిషత్ వద్ద ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం మహిళలు తయారు చేసిన వంటకాలను నాయకులు, అధికారులతో కలిసి రుచి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ఈ పథకాలను తీసుకొచ్చామన్నారు. రూ.15లక్షలతో ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్‌తో నియోజకవర్గంలో మూడు మండలాల్లో ఇప్పటికే మహిళాశక్తి క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. వీటితో ఆహారపదార్థాలను అందించి లాభాలను ఆర్జించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్డీఓ మొగులప్ప, డీపీఎం మాసన్న, ఎంపీడీఓ శ్రీనువాసులు, తహసీల్దార్ మల్లారెడ్డి, ఏపీఎం చంద్రశేఖర్, మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలు సంతోష, నాయకులు చెన్నయ్యసాగర్, జగన్‌మోహన్‌రెడ్డి, సిద్ధార్థారెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు



పొలంలో వరిపంటను పరిశీలిస్తున్న రైతులు

దామరగిద్ద: రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకుంటే అధిక దిగుబడులు పొందొచ్చని నూజీవీడ్ సీడ్స్ కంపెనీ ప్రతినిధి నర్సింహులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం-2 ఆధ్వర్యంలో మండలానికి చెందిన రైతు మల్లప్ప పొలంలో సాగుచేసిన నూజీవీడ్ సీడ్స్, తెల్ల హంస వరి పంటను క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు.. నూజీవీడు సీడ్స్ వారు అందించే హైబ్రీడ్ వరి విత్తన రకాలపై అవగాహన కల్పించారు. కొత్తగా రిలీజ్ చేసిన లావు రకం వరి (ఎన్‌పీ8912) విత్తనం గురించి తెలియజేశారు. అధిక దిగుబడి రకాలపై రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతులు లోకూర్తి మాజీ ఎంపీటీసీ కొండప్ప, మధుసూదన్ రెడ్డి, శంకర్‌రెడ్డి, దేవేందర్, బస్సప్ప, దామరగిద్ద, లింగారెడ్డిపల్లి, కందెన్‌పల్లి రైతులు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

మద్దూరు: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలను బుధవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీలకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పాల్గొన్నారు. వీహెచ్‌పీ సూచించిన 28 శ్లోకాలను విద్యార్థులకు కంఠస్థం చేసి వినిపించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డిసెంబర్ 1న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు తీసుకెళ్లనున్నట్లు వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు రఘు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.



కంఠస్థ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వ్యవసాయ కూలీలకు జీవనభృతి అందించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఊట్కూరు: ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు జీవనభృతి అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు సలీం అన్నారు. బుధవారం మండలంలోని పులిమామిడిలో సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ. 12వేలు జీవన బృతి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చలేదని ఆరోపించారు. బీడీ కార్మికులు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు వారితోపాటు వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం నెలకు 2వేల చొప్పున ఏడాదికి రూ. 24వేలు అందించాలని డిమాండ్ చేశారు. జీవనబృతి సాధన కోసం ఈ నెల 28న మండల కేంద్రలో ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెన్నప్ప, వెంకటేష్, నర్సింహులు, తిమ్మప్ప, ఎల్లప్ప పాల్గొన్నారు.

దివ్యాంగుల హామీని అమలు చేయాలి

మాగనూర్: ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సంఘం మండల అధ్యక్షుడు బాబు అన్నారు. ఎన్‌పీఆర్‌డి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఎన్నికల సమయంలో రూ.6వేలు పింఛన్ అందజేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు సూర్యనారాయణ, నర్సింహులు, రాజు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వైభవంగా ముగిసిన ఆరాధనోత్సవాలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్‌లో శ్రీ సద్గురు అవధూత నర్సింహస్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం వైభవంగా ముగిసాయి. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, మహా అలంకరణ, మధ్యాహ్నం స్వామివారికి నిర్వహించిన పల్లకి సేవ నిర్వహించారు. భక్తులతో కలిసి బీజేపీ నాయకులు నామాజీ స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు. సాయంత్రం డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివ కుమార్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మఠం కమిటీ సభ్యులు వారికి అవధూత స్వామి స్థల పురాణం చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, యువజన నాయకులు కోట్ల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న కుంభం శివకుమార్‌రెడ్డి

నాణ్యమైన వంటకాలు విక్రయించాలి

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఇటీవల ప్రారంభించిన మహిళాశక్తి క్యాంటీన్‌ను బుధవారం డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి సందర్శించారు. క్యాంటీన్‌కి వచ్చిన ఆయన ముందుగా వంటగదిని పరిశీలించారు. అనంతరం క్యాంటీన్‌లో ఉన్న వగ్రాణి, బజ్జి, పెరుగన్నం తిని బాగున్నాయని నిర్వహకులను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, బండి వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులచే ప్రతిజ్ఞ

నారాయణపేట ఎడ్యుకేషన్: అంతర్జాతీయ పిల్లల దినోత్సవ సందర్భంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ మేరకు... నేను ఇట్టి విషయాలపై ఎల్లప్పుడూ బాధ్యతగా వ్యవహరిస్తానని, నా కుటుంబం, పాఠశాల, సమాజం, నా మాతృభూమి భారతదేశం గర్వించేలా ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నానంటూ విద్యార్థులు ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ, మధుసూదన్‌రావు, భానుప్రకాష్, శిరీష, నిర్మల, ప్రతాప్, నర్సింహ, రఘురాం రెడ్డి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

పశు గణన ప్రారంభం



మరికల్: మండలంలోని పల్లెగడ్డలో పశువైద్య సిబ్బంది బుధవారం నుంచి ఇంటింటి పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్ ఇంటింటికి తిరిగి పశువుల, మేకలు, కోళ్ల, తదితర వివరాలను కుటుంబ సభ్యులను అడిగి నమోదు చేసుకున్నారు. గ్రామంలో ప్రతి కుటుంబ సభ్యులు పశుగణన కార్యక్రమానికి సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మరికల్: మండల కేజీబీవీ గాంధీ పాఠశాలలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మేన్ పోస్టును భర్తీ చేయడం కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ మనోరంజిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పూర్తిచేసిన వారు 18నుంచి 35ఏళ్ల వయస్సు వారు అర్హులన్నారు. ఈ నెల 25లోపు కస్తుర్బా గాంధీ పాఠశాలలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

వైభవంగా అయ్యప్ప మాలధారణ



ఊట్కూరు: మండలంలోని శబరి పీఠం, ఈశ్వర్ మందీర్ వద్ద బుధవారం తెల్లవారుజామున అయ్యప్ప స్వాములు మాలధారణ చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గురుస్వాములు భగవంత్, రఘువీర్ సుమారు 40మంది అయ్యప్ప భక్తులకు మాలలు వేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు భానుచందర్, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయించి తక్‌పట్టి తీసుకోవాలి



నారాయణపేట: స్థానిక వ్యవసాయమార్కెట్ యార్డులో బుధవారం మార్కెట్ చైర్మన్ ఆర్. శివారెడ్డి పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాంటాలు జరిగే సమయంలో రైతులు దగ్గరుండి కాంటాలు చేయించుకోవాలన్నారు. తక్ పట్టిలు తీసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు మార్కెట్ డైరక్టర్ శరణప్ప, మార్కెట్ సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన



ఆత్మకూర్: శ్రీశ్రీ కోదండరామస్వామి వారి విగ్రహప్రతిష్ఠాపన పూజలను వేదపండితులు మూడో రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని బాలకిష్టాపూర్ శివారులోని శ్రీఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం శ్రీసీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం కనులపండువగా నిర్వహించారు. ప్రముఖ వేదపండితులు నర్సింహాశాస్త్రి, సుబ్రమణ్యాశాస్త్రి, నాగరాజు శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గాడీ లక్ష్మీనారాయణ, అరుణ, మాజీసర్పంచులు సత్యన్న, తుకరాంనాయక్, నిర్వాహకులు మాసన్న, చిరంజీవి, గాగ్యనాయక్, సుభాష్‌నాయక్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు మాకొద్దు

ఆత్మకూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు వద్దని, విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు ఇవ్వండి అంటూ ధర్మసమాజ్ పార్టీ నాయకులు తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి స్పందించి ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధిని చేపట్టాలని కోరారు.